సాక్షి ప్రకాశం

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



రేషన్ మేస్తూ..రెచ్చిపోతూ..!
జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. పేదలకు దక్కాల్సిన బియ్యం విచ్చలవిడిగా అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. - 8లో..



పశ్చిమ ప్రకాశంలో వర్షం
జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం పడింది. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
41/28

వాతావరణం
ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

ఇంటర్‌లో వెనుకంజ

- సీనియర్ ఇంటర్‌లో 15 నుంచి 16వ స్థానానికి
- జూనియర్ ఇంటర్‌లో 18 నుంచి 19వ స్థానానికి పడిపోయిన ఉత్తీర్ణత శాతం



ఎనిమిరెడ్డి సిరి ఎంపీసీ (991)



కొడవలి హేమలత ఎంపీసీ (991)



బండి హర్షిణి ఎంపీసీ (991)



పాలకీర్తి హారికజాయ్ బైపీసీ (991)



తమ్మినేని చాతుర్య హెచ్‌ఈసీ (980)

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా వెనుకబడింది. గత సంవత్సరం సీనియర్ ఇంటర్‌లో 15వ స్థానంలో ఉన్న ప్రకాశం జిల్లా ఈ ఏడాది ఫలితాల్లో 16వ స్థానానికి పడిపోయింది. అలాగే గత సంవత్సరం జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 18వ స్థానంలో ఉంటే ఈ సంవత్సరం 19వ స్థానానికి తగ్గింది.

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో:
జనరల్ విభాగంలో 16,236 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 79.2 శాతంతో 12,863 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగానికి సంబంధించి 1540 మంది హాజరుకాగా, వారిలో 72 శాతం ఉత్తీర్ణతతో 1108 మంది పాసయ్యారు. రెండు విభాగాల్లో కలిపి 17,776 మందికిగాను 78.6 శాతంతో 13,971 మంది ఉత్తీర్ణులయ్యారు.

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో..:
జనరల్ విభాగంలో 18715 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 63 శాతంతో 11,798 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగానికి సంబంధించి 1629 మంది హాజరుకాగా వారిలో 56 శాతం ఉత్తీర్ణతతో 913 మంది పాసయ్యారు. రెండు విభాగాల్లో కలిపి 20,344 మందికిగాను 62.5 శాతంతో 12,711 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ రంగంలో ఉత్తీర్ణతా శాతం:
ప్రభుత్వ రంగంలోని కాలేజీలను పరిశీలిస్తే ప్రభుత్వ, ఏపీ మోడల్, హైస్కూల్ ప్లస్, ఏపీ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ, ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. సీనియర్ ఇంటర్ ఫలితాలకు సంబంధించి ఎయిడెడ్ కాలేజీల్లో 45 మంది విద్యార్థులు హాజరుకాగా 25 మంది ఫెయిలయ్యారు. జూనియర్ ఇంటర్ ఫలితాలకు సంబంధించి హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 224 మందికిగాను 53 మంది (23.6 శాతం), ఎయిడెడ్‌లో 122 మందికి 47 మంది (38.5 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఒంగోలు శ్రీసరస్వతి విద్యా సంస్థల కాలేజీ విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బండి హర్షిణి 991/1000, కొడవలి హేమలత 991/1000, ఎనిమిరెడ్డి సిరి 991/1000, సీనియర్ బైపీసీలో పాలకీర్తి హారికజాయ్ 991/1000 మార్కులు సాధించినట్లు చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం అభినందించింది.

కంభంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన తమ్మినేని చాతుర్య హెచ్‌ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.


యాజమాన్యం	ప్రథమ సంవత్సరం			ద్వితీయ సంవత్సరం		
	హాజరైన వారు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణత శాతం	హాజరైన వారు	ఉత్తీర్ణత	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	2118	977	46.1	1761	1210	68.7
ఏపీ మోడల్	429	281	65.5	391	317	81
హైస్కూల్ ప్లస్	224	53	23.6	110	62	56.4
ఏపీసోషల్ వెల్ఫేర్	679	584	86	527	510	96.8
ట్రైబల్ వెల్ఫేర్	80	42	52.5	57	51	89.5
కేజీబీవీ	691	395	57.2	450	346	76.9
ఎయిడెడ్	122	47	38.5	45	20	44.4
మొత్తం	4343	2379	54.8	3341	2516	75.3

సోషల్ మీడియా సైకోల హెడ్స్ చంద్రబాబు, లోకేష్

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తండ్రి కొడుకులు ఇద్దరూ సోషల్ మీడియా సైకోల హెడ్స్ అని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అండతో వీధి శునకాలు సోషల్ మీడియాలో మహిళలపై అభ్యంతరకర పోస్టులతో చెలరేగి పోతున్నాయని మండిపడ్డారు. ఐ–టీడీపీకి చెందిన చేబ్రోలు కిరణ్ ఇటీవల తమ నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో అతడిని అరెస్ట్ చేశామని, తమ ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని కూటమి ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కిరణ్ గతంలో అనేక పర్యాయాలు అభ్యంతరకర పోస్టులు పెట్టినప్పుడు కూటమి నాయకులు శునకానందం పొందారని, ఇప్పుడేందో వారు కథలు చెప్పి రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.



రామతీర్థంలో ఆధ్యాత్మిక శోభ

- గంగమ్మ తిరునాళ్లకు పోటెత్తిన జనం



ఆకట్టుకున్న విద్యుత్ ప్రభలు



ఆలయంలో పూజలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీర్థంలో వెలసిన గంగా బాలత్రిపుర సుందరీ సమేత మోక్ష రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ దుకాణాలు, జైంట్ వీల్, ప్రభలు ఆకర్షణీయంగా నిలిచాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చీమకుర్తి నుంచి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఒక్కో ప్రభ, చీమకుర్తి రూరల్ నుంచి రాజుపాలెం, కంభంపాడు, బూదవాడ నుంచి మరో మూడు ప్రభలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సామాజిక సత్రంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాలు, మంచినీటి సౌకర్యాలు వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో 7 వేల మందికి అన్నదానం చేశారు. చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, క్రిస్టపాటి శేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్‌గా సురేష్




ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ)ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించారు. పార్టీ పీఏసీ మెంబర్‌గా కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను నియమించారు. ఆమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది.


వక్ఫ్ చట్ట సవరణలను ఉపసంహరించాలి

ఒంగోలు టౌన్: వక్ఫ్ సవరణ చట్టంలో చేసిన 14 సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని, మైనారిటీల పట్ల కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం అమానుషంగా చట్ట సవరణలు చేసిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలకు టీడీపీ, జనసేన పార్టీలు వంత పలకడం సిగ్గుచేటని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాస్ మండిపడ్డారు. ధర్నాలో సీనియర్ నాయకులు ఎస్‌డీ సర్దార్, ప్రకాశరావు, వీరారెడ్డి, కొత్తకోట వెంకటేశ్వర్లు, కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు







క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

మద్దిపాడు: అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి పక్కన మద్దిపాడు మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏడుగుండ్లపాడు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనున్న బస్ షెల్టర్ వద్ద 35 నుంచి 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నాడు. అతని ఛాతిపై సరోజా అని పచ్చబొట్టు ఉంది. అతనికి సంబంధించిన ఇతర ఆనవాళ్లేమీ దొరకలేదు. స్థానిక వీఆర్వో కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు స్థానిక ఎస్సై బి.శివరామయ్య తెలిపారు. మృతుడిని గుర్తుపట్టిన వారు మద్దిపాడు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

మార్కాపురం తహసీల్దార్ కారు బోల్తా

- స్వల్ప గాయాలతో బయట పడిన తహసీల్దార్


బోల్తా కొట్టిన కారు

పొదిలి రూరల్: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడి నిర్లక్ష్యంతో వెనుక నుంచి వస్తున్న కారు బోల్తా పడింది. ఈ సంఘటన పొదిలి మండలం తలమళ్ల–అగ్రహారం మధ్య ఒంగోలు–కర్నూలు రహదారిపై వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి తన కుటుంబ సభ్యులతో కారులో ఒంగోలు వెళ్తున్నారు. పొదిలి మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం వద్దకు రాగానే ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు తన వాహనాన్ని రైట్‌కు తిప్పడంతో అతని ప్రాణాలు కాపాడే క్రమంలో తహసీల్దార్ చిరంజీవి సడన్ బ్రేక్ వేశారు. దీంతో ఒక్కసారిగా కారు మూడు పల్టీలు కొట్టి పక్కన పడింది. కారు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో తహసీల్దార్ కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. తహసీల్దార్ కుటుంబ సభ్యులు వెంటనే తేరుకుని వేరే వాహనంలో ఒంగోలు వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

- మూడు కిలోల కణతి వెలికితీత


ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ సావిత్రి, డాక్టర్ విరించి యాదవ్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విరించి వైద్యశాలలో డాక్టర్ మేడిశెట్టి సావిత్రి ఆధ్వర్యంలో రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన ఓ మహిళకు శనివారం అరుదైన శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులో ఉన్న 3 కిలోల కణతి వెలికి తీశారు. మహబూబ్‌బీ హైదరాబాద్‌లో ఉంటూ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. అక్కడి వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకుంది. కడుపులో గడ్డ ఉందని, ఆపరేషన్ చేయాలని అక్కడి వైద్యులు చెప్పారు. హైదరాబాద్ ప్రాంతంలో ఆపరేషన్ అంటే లక్షలు ఖర్చు అవుతుందని భావించిన ఆమె గిద్దలూరులోని విరించి వైద్యశాలలోని డాక్టర్ సావిత్రమ్మను సంప్రదించారు. కడుపు నొప్పి నివారణకు ఆపరేషన్ చేయాలని ఆమె సూచించారు. డాక్టర్ బీవీఆర్ఎస్ఎస్ విరించి యాదవ్, డాక్టర్ గ్రీష్మా యాదవ్‌ల నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం సాయంతో ఆపరేషన్ చేసి ఆమె కడుపులో ప్రమాదకరంగా ఉన్న కణతిని అతికష్టం మీదు వెలికి తీశారు. మహబూబ్‌బీ బంధువులు వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


కడపు నుంచి బయటకు తీసిన కణతి

గంజాయి తాగిన ఇద్దరు అరెస్టు

మార్కాపురం: పట్టణ శివారులోని మార్కెట్ యార్డ్ సమీపం వై. జంక్షన్ వద్ద గంజాయి సేవించి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు శనివారం తెలిపారు. పట్టణంలోని కరెంట్ ఆఫీస్ దగ్గర, విద్యానగర్లలో నివాసం ఉండే షేక్ అల్లాభక్ష, షేక్ అక్బర్ ఆలీలు ఇటీవల గోపీనాథ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవించినట్లు తెలిసిందన్నారు. దీంతో వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి అమ్మిన, కొనుగోలు చేసినా, సేవించినా అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు

రేషన్ మేస్తూ.. రెచ్చిపోతూ..!

జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. పేదలకు దక్కాల్సిన బియ్యం విచ్చలవిడిగా అక్రమంగా తరలిపోతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేల అండదండలతో జిల్లా సరిహద్దులు దాటి రాష్ట్రం ఎల్లలు సైతం దాటిపోతోంది. సంతనూతలపాడు నుంచి తెలంగాణ మీదుగా గుజరాత్ తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తెలంగాణ పోలీసులు పట్టుకోవడంతో జిల్లాలో రేషన్ దందాపై కూటమి పాలకులు తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోయారు. మరోసారి రేషన్ మాఫియా గుట్టురట్టు కావడంతో నిరుపేదల నోళ్లు కొడుతున్న కూటమి పాలకులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

- జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేల అండదండలతో యథేచ్ఛగా రేషన్ దందా
- పేదల నోళ్లు కొడుతూ విచ్చలవిడిగా రేషన్ బియ్యం అక్రమ తరలింపు
- మూడు పువ్వులు ఆరు కాయలుగా బియ్యం అక్రమ వ్యాపారం
- ఒక్కో ఎమ్మెల్యేకి నెలకు రూ.25 లక్షలకుపైగా ముడుతున్నట్లు ప్రచారం
- పశ్చిమ ప్రకాశంలో అడ్డాగా గిద్దలూరు, యర్రగొండపాలెం
- గిద్దలూరులో మండలానికి ఐదుగురు టీడీపీ నాయకులకు నెలవారీ మామూళ్లు
- యర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి కనుసన్నల్లో బియ్యం వ్యాపారం
- కొండపిలో రేషన్ దందా అంతా 'సత్య'మే
- ఒంగోలు వ్యాపారుల చేతుల్లో ఒంగోలు, చీరాల, అద్దంకి, కనిగిరి రేషన్ దందా
- నేరుగా సివిల్ సప్లయిస్ గోడౌన్ నుంచే టీడీపీ నాయకుల రైస్ మిల్లులకు తరలుతున్న రేషన్ బియ్యం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో రాత్రి 10 గంటలు దాటితే చాలు.. రేషన్ మాఫియా రోడ్డెక్కుతోంది. ఎక్కువగా చిన్నపాటి అప్పి ఆటోల్లో రేషన్ బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. నంబర్ ప్లేట్లు తీసేసిన వాహనాల్లో తరలిస్తున్నారు. ఎమ్మెల్యేల కంటే మేమేం తక్కువ అన్నట్లుగా పశ్చిమ ప్రకాశంలోని ఓ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి ఏకంగా బియ్యం సిండికేట్‌కు నేతృత్వం వహిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో ఇన్‌చార్జి అయితే.. మండలానికి ఇద్దరు నాయకులకు జీతమిచ్చి మరీ రేషన్ దందాను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. జిల్లా నాయకులకు పోటీగా పొరుగు జిల్లా నుంచి కూడా ఒక టీడీపీ నాయకుడు వచ్చి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఒక యువ ఎంపీ, ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న పల్నాడు ప్రాంతానికి చెందిన ఒక సీనియర్ ఎమ్మెల్యే ఆశీసులతో రంగంలోకి దిగిన సదరు టీడీపీ నాయకుడు జిల్లాలోని అనేక నియోజకవర్గాల నుంచి బియ్యం కొనుగోలు చేసి పట్టపగలే తరలించి తీసుకెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నిరుపేదల కడుపులు నింపడానికి గత ప్రభుత్వాలు రేషన్ బియ్యం ఇచ్చి ఆదుకోగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పాలకులు పేదల కడుపుకొడుతూ అక్రమార్జన కోసం అర్రులు చాస్తూ రేషన్ బియ్యాన్ని దొడ్డిదారిన తరలించి అమ్ముకుంటున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

ఒంగోలు కేంద్రంగా విస్తరించిన రేషన్ దందా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలంతా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించారు. అప్పటి వరకు ఉన్న డీలర్లను బలవంతంగా తొలగించి టీడీపీ నాయకులకు రేషన్ దుకాణాలు అప్పగించారు. అనంతరం యథేచ్ఛగా రేషన్ బియ్యం తరలిస్తూ రెండుచేతులా సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ ఒంగోలు నాయకులు ఒంగోలుతో పాటు కనిగిరి, చీరాల నియోజకవర్గాల నుంచి బియ్యం అక్రమ వ్యాపారాన్ని చేజిక్కించుకుని ఒంగోలు కేంద్రంగా విస్తరించినట్లు తెలుస్తోంది. ఒంగోలు నగరం శివారు ప్రాంతానికి చెందిన కార్పొరేటర్‌కు చీరాల, నగర నడిబొడ్డునున్న మరో కార్పొరేటర్‌కు ఒంగోలు, సంతనూతలపాడు, ఒక కాపు నాయకుడికి కనిగిరి నియోజకవర్గ రేషన్ బియ్యం వ్యాపారాన్ని అప్పగించినట్లు సమాచారం. వీరితో పాటు ఎమ్మెల్యే దామచర్ల నివాసం ఉండే బీకే అపార్ట్‌మెంట్‌లోనే నివాసం ఉంటున్న ఒక వ్యాపారికి కూడా ఈ రేషన్ వ్యాపారంలో భాగస్వామ్యం ఉందని చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసు, రవాణా, నేషనల్ హైవేపై ఉన్న పోలీసులకు నెలవారీ మామూళ్లిస్తూ పేదల బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నట్లు సమాచారం.

పట్టుకుంది 780 బస్తాలు.. లెక్క చూపింది 103 బస్తాలు...

కొండపి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సింగరాయకొండ కేంద్రంగా రేషన్ దందా కొనసాగుతోంది. గత డిసెంబర్ మొదటివారంలో సింగరాయకొండలోని ఊరిచివర ఉన్న ఒక సినిమా హాలు వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని డీఎస్‌ఓ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బృందం దాడి చేసి పట్టుకుంది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మధ్య జరుగుతున్న వార్‌లో భాగంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. లారీలోని బియ్యాన్ని రాత్రికిరాత్రే మాయం చేసేందుకు సత్య వర్గానికి చెందిన నాయకులు ప్రయత్నాలు చేసినప్పటికీ.. జనార్దన్ ఒత్తిడి మేరకు అధికారులు కేసు నమోదు చేసినట్లు చెబుతున్నారు. అయితే, అధికారులు పట్టుకున్న లారీలో 780 బస్తాల బియ్యం ఉండగా, కేవలం 103 బస్తాల బియ్యం మాత్రమే ఉన్నట్లు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. కొండపి నియోజకవర్గంలో సత్య కనుసన్నల్లోనే రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతోందని, సింగరాయకొండలోని ఒక రైస్ మిల్లు యజమానికి ఈ దందాను అప్పగించారని సమాచారం. అతడితో పాటు జరుగుమల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఒక మహిళా నాయకురాలి రైస్ మిల్లుకు కూడా బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. ఈమె కనిగిరి, సంతనూతలపాడు నుంచి కూడా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కొనుగోలు చేసిన బియ్యాన్ని గుజరాత్ తరలిస్తుండగా తెలంగాణ పోలీసులు పట్టుకోవడంతో ఈ మహిళా నాయకురాలి రేషన్ దందా వెలుగులోకి వచ్చింది.

నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో బియ్యం తరలింపు...

దర్శి నియోజకవర్గంలో రేషన్ బియ్యాన్ని నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో తరలిస్తున్నారు. అంతేగాకుండా ఎవరైనా వ్యక్తులు పోలీసులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఒకవేళ పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేసినా వాహనం నంబర్ అడుగుతున్నారని, వాహనానికి నంబర్ ప్లేట్ లేదని చెప్పగానే.. అయితే, మేమేం చేయలేమని ఫోన్ పెట్టేస్తున్నారని సమాచారం. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జి నియమించిన వ్యక్తికే బియ్యం విక్రయించాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. కనిగిరి నియోజకవర్గానికి చెందిన రేషన్ బియ్యం వ్యాపారాన్ని జిల్లాలో కీలక ఎమ్మెల్యే అనుచరులు నిర్వహిస్తున్నారు. ఒంగోలుకు చెందిన ఒక నాయకుడు ఇక్కడి ప్రధాన నాయకుడికి నెలవారీ నజరానా ఇవ్వడమే కాకుండా మండల స్థాయి నాయకులకు కూడా మామూళ్లిచ్చి బియ్యాన్ని తరలిస్తున్నాడు.

బేస్తవారిపేట రైస్ మిల్లు అడ్డాగా...

బేస్తవారిపేటలోని అనంతపురం–అమరావతి హైవేలో ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఒక రైస్ మిల్లు అడ్డగా గిద్దలూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం దందా సాగుతోంది. టీడీపీ నాయకుడికి చెందిన ఈ మిల్లుకు నేరుగా సివిల్ సప్లయిస్ గోడౌన్ నుంచే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి కొత్తగా ప్యాక్ చేసి కర్నూలు సోనా, నంద్యాల సోనా, మసూరి రైస్ పేరుతో బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. పట్టుబడిన బియ్యాన్ని కొనుగోలు చేసి ఆ బిల్లులను అడ్డం పెట్టుకుని రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి కనుసన్నల్లోనే రేషన్ బియ్యం దందా జోరుగా జరుగుతోంది. ఐదు మండలాల వ్యాపారులను సిండికేట్‌గా తయారు చేసి పర్యవేక్షిస్తున్నట్లు టీడీపీలోని ఒక వర్గం బహిరంగంగానే ఆరోపిస్తోంది.

65 శాతం బియ్యం అడ్డదారిలోనే...

జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా, దాదాపు అవన్నీ టీడీపీ నాయకులు, కార్యకర్తల చేతుల్లోనే ఉన్నాయి. వాటి నుంచి ప్రతి నెలా 9558.348 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయాల్సి ఉండగా, సుమారు 65 శాతం బియ్యాన్ని అడ్డదారుల్లో కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు తరలిస్తున్నారు. కేవలం 35 శాతం బియ్యాన్ని మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి మండలం నుంచి ఇద్దరుముగ్గురు టీడీపీ నాయకులను నియమించి వారికి రేషన్ డీలర్ల నుంచి నెలవారీ జీతాలిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కరికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జీతాలిస్తున్నట్లు చెబుతున్నారు. ఒంగోలు నుంచి మొదలుకుని కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాలలో ప్రతి మండలంలోనూ కనీసం ఇద్దరు టీడీపీ నాయకులు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి మేనేజర్లుగా పనిచేస్తున్నారని సమాచారం.

రంగనాయకుని బ్రహ్మోత్సవం ప్రారంభం

- వైభవంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


జేపీ చెరువులో ఊరేగింపుగా వెళ్తున్న ఉత్సవ విగ్రహాలు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలైన కర్నూలు, గుంటూరు, వైఎస్సార్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం పోటెత్తారు. భారీగా క్యూ కట్టి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దేవస్థానం అర్చకులైన అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారాయణాచార్యులు, అన్నవరం వెంకటరంగాచార్యులు ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటలకు అంకురార్పణ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనము, ముత్యాంగ్రహణం, యాగశాల ప్రవేశం, రాత్రి 7 గంటలకు పూలంగి సేవ, శేషవాహనం, రాత్రి 8:30 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 10 గంటలకు నెమలిగుండ్ల రంగనాయకస్వామి అలంకారం, ఆదివారం రాత్రి 2 గంటలకు హనుమంత వాహనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీసులు అందుకున్నారు. ఆదివారం జరిగే నెమలిగుండ్ల రంగనాయకస్వామి కళ్యాణానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కళ్యాణం రోజు మండపం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా బ్యారికేడ్లు ఏర్పాటు చేసినట్లు గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య తెలిపారు. భక్తులకు కాశీనాయన రెడ్ల, యోగివేయన రెడ్ల, కృష్ణదేవరాయుల కాపు బలిజ, గోపాలకృష్ణ యాదవ, ఆర్యవైశ్య, మేదర, బ్రహ్మణ, విశ్వబ్రహ్మణ అన్నసత్రాల్లో అన్నసంతర్పణ చేశారు.


నీటి గుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పశ్చిమ ప్రకాశంలో వర్షం


పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద బైక్‌పై కూలిన చెట్టు


వర్షంతో నిర్మానుష్యంగా మారిన మార్కాపురం మెయిన్ బజారు


పొన్నలూరులో ఇళ్ల మధ్య కూలిన చెట్టు


పీసీపల్లి: గాలీవానకు నేలకొరిగిన చెట్టు, ప్రహరీ

మార్కాపురం: డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి గాలీవాన, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 7.30 గంటల వరకు కురుస్తున్న వర్షంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేశారు. ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. పట్టణంతో పాటు వేములకోట, తిప్పాయపాలెం, నికరంపల్లి, దరిమడుగు, బోడపాడు, రాయవరం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటంతో పలువురు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వారం రోజుల నుంచి రోజూ సుమారు 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూ తీవ్ర ఎండ వేడికి ఇబ్బంది పడుతున్న ప్రజలు ఒక్కసారిగా వర్షం కురిసి వాతావరణం చల్ల బడటంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి 7.30 గంటల వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు.

- కూలిన చెట్లు, రేకుల షెడ్లు

పొన్నలూరు: మండలంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీయడంతో పొన్నలూరు, వెంకుపాలెం, రాజోలుపాడు, కె.అగ్రహారంతో పాటు పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. పొన్నలూరులో పొగాకు బ్యారన్‌ల రేకుల పైకప్పు కూలిపోయాయి. వర్షానికి మండలంలో ప్రధానంగా మిరప పంట కోత దశలో ఉండటంతో కొంతమేర నష్టం చేకూరే అవకాశం ఉందని, ముదురు పొగాకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

పీసీపల్లి: మండల కేంద్రం పీసీపల్లిలో గాలీవాన బీభత్సం సృష్టించింది. వడగండ్లతో మహావృక్షాలు సైతం నేలమట్టమయ్యాయి. హైస్కూల్ ఎదురుగా ఉన్న చెట్టు పడిపోవడంతో ప్రహరీ కూలిపోయింది. స్థానిక ఎస్సీ హాస్టల్లో రేకులు లేచిపోయాయి. ప్రభుత్వాస్పత్రిలో దిరిసిమ్మ చెట్లు నేలమట్టమయ్యాయి. పశు వైద్య కేంద్రంలో శతాబ్దపు దిరిసిమ్మ చెట్టు కూలిపోయింది. విద్యుత్ వైర్లు కూడా తెగిపడి కరెంట్ నిలిచిపోయింది. అమ్మవారిపల్లిలో దేవ్వళ్ల బ్రహ్మయ్య ఇంటి రేకులు లేచిపోయి అందులో ఉన్న పొగాకు పూర్తి స్థాయిగా తడిచింది. కొత్తపల్లికి చెందిన గల్లా నర్సింగ్ ఇంటి రేకులు లేచి పొగాకు పూర్తిగా తడిసి ముద్దయింది. మిరపకాయలు కూడా తడిసి ముద్దయ్యాయి.

నేడు ఏకేవీకే కాలేజీలో జాబ్‌మేళా

ఒంగోలు సిటీ: ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థుల కోసం ఒంగోలు ఏకేవీకే కాలేజీలో ప్రముఖ కంపెనీలతో ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాలేజీ ఐడీ కార్డు, అర్హతకు సంబంధించిన జెరాక్సు కాపీలతో రావాలని కోరారు. బిల్లింగ్ అండ్ స్కానింగ్, డేటా ఎంట్రీ, పికింగ్ అండ్ ప్యాకింగ్, సూపర్‌వైజర్స్, సీఎన్‌సీ, వీఎంసీ ప్రొడక్షన్, క్వాలిటీ డిస్పాచ్ టెక్నీషియన్స్ మొదలగు పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. కనీస వేతనం రూ.20 వేలు, భోజన సదుపాయం కలదని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 94818 37230 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ప్రముఖ University & Colleges లో Management Seats కోసం AP / Tamilnadu / Telangana / Karnataka రాష్ట్రాలలో MBBS / BDS / BE / B.Tech /MBA/MCA/Nursing సీట్లు వివరాలు కోసం సంప్రదించండి : 94926 34356, 88973 78381. [N-1260170]

ANM కాలేజి అమ్మబడును
■ఒంగోలులోని బాగా నడపబడుచున్న ANM నర్సింగ్ కాలేజ అడ్మిన్స్‌తో సహా అమ్మబడును. ఆసక్తి ఉన్న కొనుగోలు దార్లు వెంటనే సంప్ర॥ ✆ 70936 21555 [O-190185]

PARAMEDICAL
■ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radiographic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry, ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-399]

Real Estate

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ సంప్ర॥ జనచైతన్య మా ప్రత్యేకత. 7382396677 [G-198]

■ప్లాట్లు కొనబడును.నెల్లూరులోని ముత్తుకూరు రోడ్ కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, మైపాడురోడ్ ఏరియాలలో ప్లాట్లు కొనబడును. సంప్ర: 93464 48054, 79812 46665. [N-1268027]

అద్దెకు కావలెను
■ప్రముఖ FMCM (P&G) కంపెనీకి ఒంగోలు పరిధిలో 2000 చ॥అ॥ రెసిడెన్షియల్ బిల్డింగ్ / గోడౌన్ అద్దెకు కావలెను. వివరాలకు సంప్ర॥ ✆ 95812 34510 [O-190179]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762

Services

ఉచిత కంటి వైద్య శిబిరం
■అరవింద వారి ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏప్రిల్ 13, ఆదివారం ఉచితంగా ఓపి చూడబడును. కంటి పరీక్షలపై 50% రాయితీ & శుక్లము ఆపరేషన్ లేజర్ ఫ్యాకో ద్వారా తక్కువ ఖర్చు రూ.5,000/- లకే చేయబడును. ఇన్సూరెన్స్ కల వారికి క్యాష్‌లెస్ సౌకర్యం కలదు. సంప్ర॥ అరవింద కంటి హాస్పిటల్ ఆర్.టి.సి. బస్టాండ్ దగ్గర, ఒంగోలు. ✆ 08592-228953, 63028 99389. [OA-401]

Wanted

■ఒంగోలు పట్టణ వివాహిత మహిళలకు (10 మందికి మాత్రమే) ప్రముఖ కంపెనీలో పర్మనెంట్ జాబ్ అవకాశం. Q:డిగ్రీ, A:30సం॥పైన జీ॥ 17000/- సం॥✆98485 26399, 92471 24530 [O-190190]

■PROలు కావలెను: పేరుగాంచిన యూనివర్సిటీస్‌లో బి.టెక్ అడ్మిషన్లు, MNC కంపెనీలో ఉద్యోగ అవకాశాలు, ప్రైవేటు బ్యాంకులలో ఋణ సౌకర్యాలు కల్పించుటలో పూర్తి వివరాలు తెలియజేయుటకు PROలు అన్ని మండలాలలో కావలెను. సాయి దివ్య అకాడమి, ఒంగోలు. ✆ 89853 50382. [O-190191]

■ శారదా హైస్కూల్ (Estd.1984) పర్చూరు బాపట్ల జిల్లాలో పనిచేయుటకు ఇంగ్లీష్, IIT మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించుటకు అర్హత అనుభవం గల ఉపాధ్యాయులు కావలెను. ✆ 94914 77266, 94400 06429. [O-190180]

■ గుళ్లాపల్లిలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్సు / సెక్యూరిటి ఆఫీసర్స్ కావలెను. జీ॥ 11-15 వేలు ఆన్‌డ్యూటి మీల్స్+రూం ఫ్రీ. డ్యూటి 12గం॥ ✆ 9676649517, 8179695848. [O-190188]

■ కావలెను. కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే వుండి చూసుకొనుటకు అత్యధిక జీతం+ వ+భో. ఆంధ్ర హోమ్‌కేర్స్ VJA ✆ 91608 35559, 93473 80332 [B-001]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1270235]

■Secur Security Services టంగుటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ SO లు మరియు సెక్యూరిటీ ASO లు గార్డ్స్, లేడీ గార్డ్స్ కావలెను. సంప్ర: 99595 98279. [NA-24128]

■ కిసాన్ మిత్రలో NLM స్కీమ్ క్రింద రిలేషన్ షిప్ మేనేజర్స్, DMలు కావలెను. జీతం: మేనేజర్స్‌కి 25 వేలు, DM లకి 35 వేలు. అర్హత: 10th to డిగ్రీ వరకు. సంప్ర॥ 9392282701, 9000501816, 8341890291. [A-1568]

■ బిజినెస్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 5సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30సం॥లోపు వారు గుంటూరులో పనిచేయుటకు రెజ్యూములను hoadvtjobs@gmail.comకు పంపగలరు. [G-4]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002700]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను, పేషేంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీతం: 18k Ph: 9640648899, 9640528899 [HA-1907]

■ Sri Saradha Niketan Public School Martur Bapatla Dist. Wanted Jobs Maths, Physics, Chemistry Qly M.Sc B.Ed (Exp 5 to 10 Yrs) With JEE-Mains, Neet, English-01, B.A (or) M.A CEB-01 (M.Com or M.B.A) Computer Operator-02 (Any Computer Certificate) Nurse-01 (ANM/GNM) Ph. ✆ 70957 23036, 93988 32060 [O-787344]

■ Wanted Female Telecallers for an overseas educational consultancy salary from 10k for more details contact: 9052925353 [G-84]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.